క్లుప్తంగా

పశుగ్రాసం దగ్ధం



పాన్‌గల్: ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన తెలుగు రాములు ఇంటి సమీపంలో రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని కుప్పగా ఏర్పాటు చేసుకున్నాడు. రోజు మాదిరిగానే పనుల నిమిత్తం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. ఇంటి సమీపంలోని పశుగ్రాసానికి మంటలు అంటుకున్నాయని రాములుకు సమాచారం అందించారు. పొలం నుంచి ఇంటికొచ్చే లోపే పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదైంది. పశుగ్రాసం ప్రమాదవశాత్తు కాలిపోయిందా లేక ఎవరైనా కావాలని అంటిచారా? అనే విషయం అంతుపట్టడంలేదని బాధితుడు పేర్కొన్నాడు. పశుగ్రాసం విలువ దాదాపుగా రూ.20 వేల వరకు ఉంటుందని తెలిపాడు. ప్రభుత్వ పరంగా సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

చనిపోయిన వ్యక్తి వివరాలు లభ్యం

చిన్నంబావి: మండలంలోని వెలగొండ గ్రామ శివారులో పెబ్బేరు ప్రధాన రోడ్డు పక్కన గుంతలో చనిపోయిన వ్యక్తి వివరాలు గుర్తించినట్లు ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు. శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి విషయం సోషల్ మిడియాలో ప్రచారం కావడంతో ఆయన కు టుంబ సభ్యులు వనపర్తి సీఐని కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతిపై అనుమానా లు వ్యక్తం చేయడంతో నాలుగు బృందాలతో కేసును విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ప్రియాంకను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు

పేదప్రజలకు... వీపనగండ్ల: పేద ప్రజల బాగుకోసం ప్రాణాలు సైతం వదిలిన ఇందిరాగాంధీ వారసురాలిగా ప్రత్యక్ష ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసిన ప్రియాంక గాంధీని అత్యధిక మెజారిటీతో గెలిపించిన వాయనాడ్ ప్రజలకు కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీరయ్యయాదవ్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నారాయణరెడ్డి, ఎత్తం కృష్ణయ్య, సింగిల్‌విండో మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఇంద్రకంటి వెంకటేష్, వెంకటేశ్వరమ్మ, ఈశ్వరమ్మ, కవితలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రియాంక గాంధీ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.

అపరిశుభ్రంగా తాగునీటి ట్యాంకు



పాన్‌గల్: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వారానికి రెండు సార్లు డ్రై డే నిర్వహిస్తున్నా, జిల్లా అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నా పరిసరాల పరిశుభ్రత, తాగునీటి ట్యాంకులు, ట్యాంకు పరిసరాల్లో పరిశుభ్రత విషయంలో ఎలాంటి మార్పులు కన్పించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, ట్యాంకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మార్పులు కన్పించడంలేదు. మండలంలోని బండపల్లి గ్రామంలోని తాగునీటి ట్యాంకు పాకర పట్టి, పరిసరాలు అపరిశుభ్రంగా మారిందని, దీంతో నీరు కూడా అపరిశుభ్రంగా వస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణమే.. కొనుగోలు కేంద్రం



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి గ్రామంలోని తెలంగాణ క్రీడా ప్రాంగణం కేవలం ధాన్యం కొనుగోళ్లకే ఉపయోగపడుతుంది. గత తెలంగాణ ప్రభుత్వం గ్రామంలోని రైతు వేదిక సమీపంలో ప్రభుత్వ భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. భూమి చదను, ట్రాక్ ఏర్పాటు, క్రీడా పరికరాలు , బోర్డు ఏర్పాటు తదితరాల పేరిట అధిక మొత్తంలో నిధులు ఖర్చయ్యాయి. క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభం తోనే సరిపెట్టారు. గ్రామానికి దూరంగా ఉండటంతో యువకులు, పిల్లలు, గ్రామస్తులు వెళ్లలేకపోతున్నారు. ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

- పోలింగ్ బూత్ పరిధిలో దరఖాస్తుల స్వీకరణ
- కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్, అధికారులు



కల్వరాలలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణమూర్తి

అమరచింత: బీఎల్‌ఓలు తమ తమ పోలింగ్ బూత్‌ల పరిధిలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని ఆర్‌ఐ వెంకటయ్య అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నాగల్ కడ్మూర్‌లోని పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు సెంటర్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఓటరు లిస్ట్‌లో పేర్ల మార్పులు, చేర్పులు, ఇంటి అడ్రస్‌లు, వయస్సులో తేడాలు ఉంటే వాటిని సరిచేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

- మదనాపురం మండలంలోని దుప్పల్లి పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ అబ్రహం లింకన్ పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్ తారమ్మ, గ్రామ పంచాయతీ సిబ్బంది రాజేష్, తదితరులు ఉన్నారు.



పోలింగ్ బూత్ వద్ద దరఖాస్తులు తీసుకుంటున్న ఆర్‌ఐ, బీఎల్‌ఓలు



దుప్పల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ అబ్రహం లింకన్

ఓటర్ లిస్ట్‌లో తప్పులు దొర్లకుండా చూడాలి

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు నూతన ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి తెలిపారు. ఆదివారం కల్వరాల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో ఓటర్ నమోదు క్యాంపులను వారు పరిశీలించారు. ఆఫ్‌లైన్ ద్వారా మూడు దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు సుగుణాబాయ్, మహేశ్వరి, ఎల్లమ్మ, పారిజాత, చంద్రకళ, వరలక్ష్మి, కమల, తదితరులు పాల్గొన్నారు.

గైడ్ టీచర్, హెచ్‌ఎంను అభినందించిన చిన్నారెడ్డి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం జగత్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని భువనేశ్వరి ప్రాజెక్టు జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టు హర్యాణా పంచకులాలో డిసెంబరు 16నుంచి 22 వరకు జాతీయ సైన్స్‌ఫెయిర్‌లో ప్రదర్శించనుంది. జాతీయ స్థాయిలో ప్రదర్శించేందుకు కృషి చేసిన గైడ్ టీచర్ జ్యోతిర్మయిని, హెచ్‌ఎం శ్రీనివాసులును 52వ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, డీఈఓ గోవిందరాజులు అభినందించారు. వనపర్తి జిల్లాలో ఈ ఘనత పొందిన విద్యార్థిని భువనేశ్వరి ప్రాజెక్టును తయారు చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందడం గర్వంగా ఉందన్నారు.



గైడ్ టీచర్ జ్యోతిర్మయి, హెచ్‌ఎం శ్రీనివాసులును అభినందిస్తున్న డాక్టర్ జి.చిన్నారెడ్డి

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు

వీపనగండ్ల: జిల్లా కేంద్రంలో నిర్వహించిన 52వ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు గౌతమ్‌చక్రి, పి చరణ్‌లు ట్రాన్స్‌పోర్ట్ కమ్యూనికేషన్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చిన్నతనం లోనే జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు గ్రామ పెద్దలు, వివిధ ప్రజా సంఘాల నాయకులు అభినందించారు.



సైన్స్ ఫెయిర్‌లో గెలుపొందిన విద్యార్థులు

విద్యార్థిని సన్మానించిన నాయకులు

ఖిల్లాఘనపురం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన నాయకులు ఆగారం ప్రకాష్ ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన 300 మీటర్ల రన్నింగ్, 50 మీటర్ల రన్నింగ్, స్టాండింగ్ బ్రాండ్ జంపు మూడు విభాగాల్లో గోల్డు మెడల్ సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఆగారం ప్రకాష్ విద్యార్థి ఎరుకలి మహేష్‌ను, కోచ్ దేవేందర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహ్మద్ మూజాహిద్, లింగస్వామి, స్వామి, గౌస్, అజీమ్, హనుమంతు, శ్రీను, తోక రాజు, వరకుమార్, రాజు, ఎల్లయ్య, చంద్రమౌళి, రమేష్ పాల్గొన్నారు.

అమరచింత వాసులకు సేవా పురస్కారాలు

అమరచింత: అమరచింత పట్టణానికి చెందిన కవి ఉప్పరి తిరుమలేష్‌తో పాటు కురుమూర్తి స్వామి ఆలయం వద్ద అన్నదాన సత్రంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రభుదాస్‌లకు కీర్తిశేషులు బెల్లంసత్యమ్మ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. కవి ఉప్పరి తిరుమలేష్, ప్రభుదాస్ మాట్లాడుతూ అమరచింత సంస్థాన సాహిత్య వారసత్వం కొనసాగింపుగా కురుమూర్తి స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కీర్తిశేషులు బెల్లం సత్యమ్మ స్మారక ట్రస్టు ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ఉత్తమ సేవా పురస్కారాలు అందించారన్నారు. సాహిత్య రంగంలో తిరుమలేష్‌కు పురస్కారం దక్కగా, ఆలయంలో 20 సంవత్సరాలుగా అన్నదాన సత్రంను పర్యవేక్షిస్తున్నందుకు ప్రభుదాస్‌కు మెమొంటోలు, షాలువాతో సత్కరించారు. అమ్మపురం సంస్థానదీశు లు రాజ శ్రీరాం భూపాల్, ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, బెల్లం సాయిలు పలువురు పాల్గొన్నారు.



మెమొంటో అందుకుంటున్న తిరుమలేశ్

జిల్లా కరాటే సంఘం సభ్యులుగా కొత్తకోట మాస్టర్స్

కొత్తకోట రూరల్: వనపర్తి పట్టణంలోని రెయిన్‌బో స్కూల్లో ఆదివారం వనపర్తి జిల్లా కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అబ్జర్వర్‌గా శంకర్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కరాటే నూతన సంఘం, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. వారిలో కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ బోటుఖాన్ కరాటే డు ఇండియాకి చెందిన మాస్టర్స్‌ని ఎన్నుకున్నారు. వారిలో ఉపాధ్యక్షులుగా జి.పరమేష్(కనిమెట్ట), వడ్డే శివరాజ్ (మదనాపూర్),ఆర్గనైజర్ సెక్రటరీలుగా జాఫర్ సాధిక్, జి.హరీష్ యాదవ్, జాయింట్ సెక్రటరీ ఎండీ.కైసర్, జే.సుమలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో అవకాశం రావడానికి సహకరించి సీనియర్ కరాటే మాస్టర్ అబ్దుల్ నబీకి నూతన జిల్లా కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికైన కొత్తకోట సీనియర్ కరాటే మాస్టర్లతో రాష్ట్ర అబ్జర్వర్ శంకర్‌నాయక్

మండల ఆర్గనైజర్ సెక్రటరీగా శివరాజ్

మదనాపురం: వనపర్తి పట్టణంలోని రెయిన్‌బో స్కూల్లో నిర్వహించిన జిల్లా కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో మదనాపురం మండల కేంద్రానికి చెందిన వడ్డె శివరాజ్‌ను మండల ఆర్గనైజర్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆయన పలువురు అభినందించి సన్మానించారు.

25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

మదనాపురం: మండల కేంద్రం నుంచి ఇరత ప్రాంతాలకు గుట్టు చప్పుడు కాకుండా తరలించేందుకు సిద్ధం చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శనివారం అర్ధరాత్రి మదనాపురం పోలీసులు పట్టుకు న్నారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మదనాపురం రైల్వే స్టేషన్ సమీపంలో బియ్యం లోడుతో బొలెరో వాహనం ఆగిఉందని గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడి వెళ్లి పట్టుకున్నారు. బొలెరో వాహనంలో 55 సంచులు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయని పేర్కొన్నారు. డ్రైవర్‌ను విచారించగా వెంకటేష్ తండ్రి చిన్న నరసన్న మదనాపూర్ అని చెప్పడంతో స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ వేణు బియ్యాన్ని పరీక్షించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసామన్నారు. అనుమతి లేకుండా బియ్యం వ్యాపారం ఎవరు చేసిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

ఆటోలో మహిళ ప్రసవం



ఖిల్లాఘనపురం: ఆటోలో ఆస్పత్రికి వెళ్తున్న మహిళనకు పురుటి నొప్పులు రావడంతో అక్కడే ప్రసవమైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. మండలంలోని కోతులకుంట తండాకు చెందిన కెతావత్ వెంకటేష్ భార్య కెతావత్ గల్లి ప్రసవ సమయం కావడంతో ఆదివారం పురుటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి ఆటోలో తీసుకెళ్తున్నారు. సోళీపురం గ్రామం దాటిన తరువాత ఆమె నొప్పులు పెరిగి ఆటో దగ్గర పురుడు పోసుకుని ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అదే దారిలో వెళ్తున్న 102 పైలెట్ రమేష్ వారిని వాహనంలో ఎక్కించుకుని ఖిల్లాఘనపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది తల్లీబిడ్డకు కావలిసిన వైద్యం అందించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



దంతనూరులో సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మదనాపురం: మండలంలోని దంతనూరులో సన్న రకం వడ్లకు రూ.500లు బోనస్ ఇచ్చిన సందర్భంగా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పావని, నాయకులు ఉప్పరి వెంకటన్న, నరసింహులు, రాజవర్ధన్ రెడ్డి, నాగరాజ్‌గౌడ్, గుగ్గిల రాముడు, కిరణ్, రత్నారెడ్డి, లక్ష్మీనారాయణ, రామాచారి, శివ, చందు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఖిల్లాఘనపురం: గ్రామ స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి గ్రామ బూత్ కమిటీల అధ్యక్షులు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు బుచ్చిబాబుగౌడు, శక్తి కేంద్రం ఇన్‌చార్జి విక్రంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అప్పారెడ్డిపల్లి గ్రామంలో బీజేపీ మండల కార్యదర్శి కేశన్న, మహిమోర్చా అధ్యక్షులు ఈదమ్మల ఆధ్వర్యంలో 17, 18వ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కె.వెంకటేష్, యువమోర్చా అధ్యక్షులు గోపి ముదిరాజ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు రాంచందర్, బూత్ కమిటీ అధ్యక్షులు విష్ణు, చిన్నయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి



ఖిల్లాఘనపురంలో ర్యాలీ చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు, విద్యార్థులు

ఖిల్లాఘనపురం: సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని జిల్లా విశ్వహిందు పరిషత్ అధ్యక్షులు గాండ్ల రాములు, వనపర్తి జిల్లా సేవా ప్రముఖ్ బెస్త శ్రీను, రిటైర్డ్ ఏఎస్పీ మేరేటి ప్రభాకర్‌రెడ్డి, రాచాల జనార్దన్‌లు అన్నారు. ఆదివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఐదు బాలసంస్కార కేంద్రాల సమ్మేళనం నిర్వహించారు. శిశుమందిర్ పాఠశాల నుంచి బజారు ఆంజనేయస్వామి దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శేషాచార్యులు, మాజీ సర్పంచు వెంకటరమణ, ఎస్ఎల్ మురళీకృష్ణ, ప్రకాష్, గంజాయి రమేష్, విక్రం, బుచ్చిబాబుగౌడు, గోపి, శివశంకర్, నారాయణ, భాస్కర్, గోపాల్ పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై ప్రచారం

కొత్తకోట రూరల్: మండల కేంద్రంలో ప్రజా పాలన విజయోత్సవాలపై ఆదివారం కళాకారులు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పాటలు పాడి ప్రజలకు వినిపించారు. కొత్తకోట చౌరస్తాలో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలు, కూలీలకు, రైతులకు, సాధారణ జనాభాకు ప్రభుత్వ పథకాలు ఎలా ఉపయోగపడుతున్నాయనే విషయాలు తెలిపారు.



కొత్తకోట చౌరస్తాలో ప్రచారం చేస్తున్న కళాకారులు

పామిరెడ్డిపల్లిలో కొండచిలువ కలకలం



కొండచిలువతో ఏబీసీడీ సభ్యులు, గ్రామస్తులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లిలో సాయికుమార్‌రెడ్డి ఇంట్లో కొండచిలువ కనిపించింది. అందరూ చూస్తుండగానే పది అడుగుల పొడవున్న కొండచిలువ ఇంటి చివరన ఉన్న వైరాగి చెరువు నుంచి ఇంట్లోకి ప్రవేశించింది. యజమాని వనపర్తిలోని అసోసియేషన్ ఫర్ బయోడైవర్సిటీ కన్సర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఏబీసీడీ) సభ్యుడు, సర్ప రక్షకుడు శివకుమార్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. ఆయన వెంటనే గ్రామానికి చేరుకొని కొండచిలువను పట్టుకోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఏబీసీడీ సభ్యులు అభిరామ్, శివకుమార్‌ను గ్రామస్తులు అభినందించారు. పట్టుబడిన కొండచిలువను అటవీ అధికారుల సాయంతో అటవీ ప్రాంతంలో వదిలేస్తామని వారు తెలిపారు.

బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



గోపాల్‌పేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితుడిని సంఘటనా స్థలంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి పరామర్శించారు. కర్నూలుకు చెందిన సుంకన్న వనపర్తి జిల్లాలోని ఆయా గ్రామాల్లో రగ్గులు, దుప్పట్లు అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఆదివారం వ్యాపారం నిమిత్తం గోపాల్‌పేటవైపు వెళ్లి మధ్యాహ్నం తిరిగి వనపర్తికి వెళ్తున్నాడు. జెర్రిపోతుల మైసమ్మ దాటాక తన బైక్‌పై ఉన్న వ్యక్తి డ్రైవింగ్ చేస్తున్న సుంకన్న చేతికి తగిలాడు. దీంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడింది. సుంకన్న తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో వనపర్తి నుంచి గోపాల్‌పేటకు వెళ్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి సంఘటన స్థలంలో బాధితుడిని పరామర్శించారు. వెంటనే ఆటో మాట్లాడి వైద్యులకు ఫోన్ చేసి మంచి వైద్యం అందించాలని సూచించాడు.